ప్రజాశక్తి
సోమవారం 14 అక్టోబర్ 2024
5
అల్లూరి సీతారామరాజు

ప్రొఫెసర్ సాయిబాబాకు సిపిఎం ఘన నివాళి

ప్రజాశక్తి-పాడేరు: ప్రముఖ విద్యావేత్త, పౌర హక్కుల నేత ప్రొఫెసర్ జిఎస్ సాయిబాబా మృతి పట్ల సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనరస ఆదివారం ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియ చేశారు. ఆయన మరణం అన్ని వర్గాల వారిని కలిచి వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. భౌతికంగా నడవలేని స్థితిలో చక్రాల కుర్చీకే పరిమితమైన సాయిబాబాను టెర్రరిస్టు నెపంతో దీర్ఘకాలం చేయని నేరానికి జైలులో మగ్గిపోచేలా చేశారన్నారు. సాయిబాబాది సహజ మరణం కాదన్నారు. ఇది ప్రభుత్వ నిర్బంధ ఫలితమే అని తెలిపారు. అర్బన్ నక్సల్స్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యక వాదులను, మేధావులను వేధించడాన్ని సిపిఎం ఖండిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఇటువంటి చర్యలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

మన్యంలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పర్యాటక ప్రాంతాలకు రెండు రోజులుగా పర్యాటకుల సందడి నెలకొంది. జిల్లాలోని ఆయా పర్యాటక ప్రాంతాలకు పర్యాటకులను అధికంగా సందర్శించారు. అనంతగిరి, అరకులోయ, డుంబ్రిగూడ, హుకుంపేట, పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, జికే వీధి, సీలేరు, మారేడుమిల్లి దేవి పట్టణం, చింతూరు, మోతుగూడెం ప్రాంతాల్లో సందర్శిత ప్రాంతాలన్నీ పర్యాటకులతో ఆదివారం రద్దీగా మారాయి. ఆంధ్ర ఊటీగా పిలవబడే అరకు లోయలో పరుచుకున్న మంచు తెరల దుప్పటి కొత్త అనుభవాన్ని పంచుతోంది. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు ప్రస్తుత వాతావరణంలో పొగ మంచు తాకిడిలో ప్రకృతి సోయగాలకు పర్యాటకులు ఉబ్బి తబ్బి అవుతున్నారు. లంబసింగిలోని ప్రస్తుత వాతావరణం పరిస్థితిలో పర్యాటకులు కొత్త అనుభవాలను రుచి చూస్తున్నారు. జిల్లా పర్యాటక ప్రాంతాలను చూసేందుకు పర్యాటకులు క్యూ కడుతున్నారు. ప్రకృతి అందాలకు ప్రసిద్ధి పొందిన బొర్ర గృహాలు, కటికి, తాటిగూడ జలపాతాలు, జలవిహారి, కొత్తపల్లి జలపాతాలతో పాటు పాడేరు మండలంలోని వంజంగి హిల్స్‌లోని మేఘాల కొండపై మంచు అందాలు కూడా పర్యాటకులను ఎంతో ఆకర్షించాయి. అనేక ప్రాంతాల నుంచి పర్యాటకులంతా ఏజెన్సీకి చేరుకుని ఇక్కడ ప్రకృతి అందాలను వీక్షించారు. పాడేరులోని మోదకొండమ్మ తల్లి, బోడ కొండమ్మ, దారాలమ్మ తల్లి ఆలయాల వద్ద కూడా పర్యాటకుల, భక్తుల రద్దీ నెలకొంది. ఇక్కడ దేవతలను భవాని, అయ్యప్ప మాలధారణ భక్తులతో పాటు ఆయా వర్గాల భక్తులు దర్శించుకున్నారు. హుకుంపేట మండలంలోని పర్యాటక ఆధ్యాత్మిక కేంద్రమైన మత్స్యగుండంకు కూడా పర్యాటకులు సందర్శించారు.

డుంబ్రిగుడ మండలం చాపరాయి జలపాతం వద్ద పర్యాటకులు

వంజంగి హిల్స్ వద్ద పర్యాటకులు

చాపరాయి జలపాతం కిటకిట

డుంబ్రిగుడ: పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతంకు ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు తరలిరావడంతో కిటకిటలాడింది. జలపాతంలో సరదాగా చిన్న, పెద్ద తేడా లేకుండా స్నానాలు చేస్తూ ఆనందంగా గడిపారు. చాపరాయి లోని ఉద్యానవనంలో పర్యాటకులు ఫోటోలు తీయించుకుంటూ సందడి చేశారు. పర్యాటక ప్రదేశంలో పర్యాటకులు పోటెత్తాడంతో సందడి వాతావరణం నెలకొంది.

చెక్‌డ్యామ్‌కు మరమ్మతులు చేపట్టరూ..

వరదలకు కొట్టుకుపోయిన మాదిగమల్లు చెక్ డ్యాం ఇదే

ప్రజాశక్తి -సీలేరు: భారీ వర్షాలకు కొట్టుకుపోయిన మాదిగ మల్లు చెక్ డ్యామ్‌లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని గిరి రైతులు డిమాండ్ చేశారు. గత నెల 8న కురిసిన భారీ వర్షాలకు జీకే వీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ మాదిగమల్లు గ్రామ సమీపంలో ఉన్న రెండు చెక్‌డ్యాములు వరదలకు కొట్టుకుపోయాయి. వీటి ఆధారంగానే గ్రామంలోని 60మంది గిరిజన రైతులు పంటలను సాగుచేస్తుండగా, వరదలకు ఇవి కొట్టుకుపోవడంతో సాగునీటి సమస్య తలెత్తిందని వారంతా ఆవేదన చెందుతున్నారు. చెక్ డ్యాముల ద్వారా 200 ఎకరాలు పంట పొలాలకు ఇంతకుముందు సాగునీరు అందేదని, ఇపుడు ఆయకట్టుకు సీరు అందని పరిస్థితి ఉందని రైతులు తీవ్ర ఆందోళన గురవుతున్నారు. చెక్ డ్యాంలకు వెంటనే మరమ్మతులు చేసి వినియోగంలో తేవాలని అధికారులకు మొరపెట్టుకున్నా, ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గత నెలలో జరిగిన విపత్తు నష్టాన్ని అధికారులు తూతూమంత్రంగా రోడ్లపై నుంచే చూసి, అరకొరగా అంచనా వేసి వెళ్లిపోయారని ఇప్పటివరకు తమ వైపు చూసే నాథుడే కరువయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ స్పందించి మాదిగమల్లులో చెక్ డ్యాములు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తెచ్చే చర్యలు చేపట్టి, రైతులను ఆదుకోవాలని కోరారు.

గ్రామాల్లో కాఫీ కొనుగోలుకు సన్నాహం

- ప్రజాశక్తితో గిరిజన సహకార సంస్థ డివిజనల్ మేనేజర్ సింహాచలం

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలోని పాడేరు డివిజన్లో ఈ ఏడాది గిరిజన రైతుల నుంచి కాఫీ కొనుగోలుకు చర్యలు చేపట్టామని గిరిజన సహకార సంస్థ డివిజనల్ మేనేజర్ సింహాచలం వెల్లడించారు. జీసీసీ ద్వారా కాఫీ కొనుగోలు, చేపడుతున్న ఏర్పాట్లపై ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపిన వివరాలు ఆయన మాటల్లోనే...

జిసిసి కాఫీ కొనుగోలు వార్షిక లక్ష్యం ఎంత?

పాడేరు డివిజన్లోని 6 సొసైటీల పరిధిలో ఈ ఏడాది గిరిజన రైతుల నుంచి1353.974 మెట్రిక్ టన్నులు కాఫీ కొనుగోలు జిసిసి లక్ష్యంగా నిర్ణయించారు.

కాఫీ కొనుగోళ్లకు చేపడుతున్న చర్యలు?

గ్రామాలకు వెళ్లి నేరుగా గిరిజన రైతుల నుంచి కాఫీ కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేస్తున్నాం. పాడేరు డివిజన్లోని 6 సొసైటీల పరిధిలో ఉన్న 8 మండలాల్లో కాఫీ దిగుబడి జరుగుతున్న ప్రతి గ్రామంలో జిసిసి సిబ్బంది వెళ్లి కాఫీ కొనుగోళ్ల చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం..

పూలింగ్ అసిస్టెంట్ల నియామకం

9 మంది పూలింగ్ అసిస్టెంట్లను 10 మంది సేల్స్ మాన్‌లకు 29 మంది కాంట్రాక్ట్ సేల్స్ మేన్‌లకు కాఫీ సేకరణ బాధ్యతలు అప్పగించాం. వీరికి వాహనాలు కూడా సమకూరుస్తున్నాం. బృందాలుగా వెళ్లి గ్రామాలకు వెళ్లి కాఫీ కొనుగోలు నిర్వహిస్తారు.

633 గ్రామాల్లో కాఫీ కొనుగోలు

డివిజన్ పరిధిలోని కాఫీ దిగుబడి వస్తున్న 633 గ్రామాల్లో కాఫీ కొనుగోలు నిర్వహిస్తాం. సుమారు 12 వేల హెక్టార్లలో కాఫీ దిగుబడి చేస్తున్న 8668 మంది గిరిజన రైతుల నుంచి కాఫీ కొనుగోలు నిర్వహించనున్నాం. పార్చ్ మెంట్ కాఫీ 1107.021 మెట్రిక్ టన్నులు చెర్రీ కాఫీ 246.843 మెట్రిక్ టన్నులు సహకరించేందుకు లక్ష్యంగా నిర్ణయించాం.

నాణ్యమైన కాఫీ కొనుగోలుకు చర్యలు?

గిరిజన రైతుల నుంచి నాణ్యమైన కాఫీ కొనుగోలు చేసేందుకు కషి చేస్తున్నాం ముఖ్యంగా తేమశాతం 10 శాతం మించకుండా నాణ్యమైన కాఫీని రైతులు సిద్ధం చేసే విధంగా అవగాహన కల్పిస్తున్నాం.. గిరిజన రైతులు పండించే కాఫీకి మంచి ధర నాణ్యతను పెంచేందుకు కృషి చేస్తున్నాం.

యుటిఎఫ్ ఆధ్వర్యాన మొక్కల నాటివేత

బాదం మొక్కలు నాటుతున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి, -కూనవరం : మండల కేంద్రంలోని జగ్గవరం క్రాస్‌రోడ్ వద్ద ఈరోజు యుటిఎఫ్.కూనవరం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం బాదం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.నాగేశ్వరరావు, పి.కన్నారావు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు, భావితరాలకు కాలుష్యంలేని సమాజాన్ని అందించేందుకు మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని బాధ్యత అందరిపైనా ఉందన్నారు. వాతావరణంలో సమతుల్యత లోపించడం వల్లే ప్రస్తుతం అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలు చోటుచేసుకుంటున్నాయని, అవి మరింతగా విషమించకముందే ప్రజలంతా మేల్కోవాలన్నారు. మొక్కలను నాటి, వనాలను సంరక్షించడమే దీనికి మార్గమని, అందులో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎం..ప్రమీల, ఆదివాసీ లాయర్ మడివిరవితేజ పాల్గొన్నారు.

భారీ వాహనంతో ధ్వంసమైన రహదారి

భారీ వాహనాలతో రహదారులు ధ్వంసం

ప్రజాశక్తి-చింతపల్లి: గ్రామంలోని పురవీధులలో భారీ వాహనాలు తిరుగుతుండడంతో రహదారులు ధ్వంసం అవుతున్నాయి. రామాలయం వీధిలో సిమెంటు లోడుతో వస్తున్న భారీ లారీలతో రహదారి దెబ్బతింటుంది. ఇప్పటికే రామాలయం వీధిలోని సకల దేవతల ఆలయ సమీపంలో రహదారి మధ్యలో కల్వర్టు వద్ద రంధ్రం ఏర్పడి వాహనాల రాకపోకల సమయంలోనే గాక, సాధారణంగాను ప్రయాణికులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనికి తోడు స్థానిక మసీదు సమీపంలో సిమెంటు లోడుతో వచ్చిన లారీ కారణంగా కుంగిన రహదారితో లారీ కాలువలోకి ఒరిగి పోయింది. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు రాకపోకలు సాగించే పాదాచారులు సైతం తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. భారీ వాహనాలను పురవీధులలోకి రావడానికి నియంత్రించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అంత్రిగుడ మలుపు ఇదే..

ప్రమాదకరంగా అంత్రిగుడ మలుపు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న 516 ఈ జాతీయ రహదారి అంత్రిగుడ మలుపు ప్రమాదకరంగా మారింది. ఇక్కడ తరచుగా వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. చాపరాయి జలపాతంకు తరచుగా వచ్చే వాహనాలు ప్రమాదాలకు గురవుతుండటంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతం సమీపంలో ఉండటంతో పాటు అరుకు, పాడేరు జిల్లా కేంద్రానికి ఈ రోడ్డు ప్రధాన రోడ్డు కావడంతో ఈ రోడ్డు గుండా నిత్యం వాహనాలు అధిక సంఖ్యలో ప్రయాణాలు సాగిస్తున్నాయి. వాహనాల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుండటంతో వాహనదారులు, ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

ప్రజాశక్తి- చింతూరు: రెగ్యులర్ వర్కర్లతో సమానంగా పనిచేస్తున్న గిరిజన సంక్షేమ హాస్టల్స్ ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించి, సమానపనికి సమాన వేతనాలు ఇవ్వాలని సిఐటియు రంపచోడవరం జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. ఆదివారం చింతూరులో జరిగిన హాస్టల్ వర్కర్ల సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ రోజూ12 నుండి 14 గంటల వరకు పనిచేస్తున్న వీరికి చాలీచాలని వేతనాలను ఇస్తున్నారని, ప్రస్తుతం పెరుగుతున్న నిత్యావసరాలు, ఇతర ధరలతో వీరికిచ్చే జీతంతో కుటుంబపోషణ దుర్భరమౌతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 1991 సరళీకరణ ఆర్థిక విధానాల తర్వాత దేశవ్యాప్తంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల శాఖలలో రెగ్యులర్ ఉద్యోగాలను నియమించాల్సింది పోయి, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ పద్ధతిలో నియమించుకొని అతి తక్కువ వేతనాలు ఇచ్చి, వారితో వెట్టిచాకరి చేయించు కుంటున్నారని విమర్శించారు. సంఘాల జాతీయ నాయకత్వం, సుప్రీంకోర్టు లాంటి సంస్థలు రెగ్యులర్ ఉద్యోగులు మాదిరిగానే వీరికి సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని తీర్పులు చెబుతున్న ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. పని ఒత్తిడికి గురై విధి నిర్వహణలో చనిపోతున్న వారి కుటుంబానికి ఆసరాగా కారుణ్య నియామకాలు కూడా చేపట్టడం లేదన్నారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన హాస్టల్ అవుట్సోర్సింగ్ కార్మికుల క్రమబద్ధీకరణ, సమాన పనికి సమాన వేతనాలు, చట్టం ప్రకారం పిఎఫ్, ఇఎస్ఐ , పెన్షన్, ఇతర రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, కారుణ్య నియామకాలు అమలు చేయాలనీ డిమాండ్ చేశారు.. హాస్టల్ వర్కర్లకు జిఒ ప్రకారం సెలవులు అమలు, సెలవుల్లో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సోడి దుర్గారావు, కొమరం వీరయ్య, చంద్రమ్మ, తిరుపతమ్మ, రాజమణి, రాంబాబు, వీరబాబు, లక్ష్మి, చెల్లెమ్మ, పుల్లమ్మ, సీతమ్మ పాల్గొన్నారు.

కమ్మేసిన పొగమంచు

దబ్బకోట గ్రామ సమీపంలో కురుస్తున్న మంచు

ప్రజాశక్తి -సీలేరు: జికె.వీధి మండలం దారకొండ ఘాట్ రోడ్‌ను ఆదివారం ఉదయం పొగమంచుకమ్ముకుంది. ఘాట్‌రోడ్డులో విస్తారంగా పొగమంచు కురవడంతో వాహన చోదకులు రహదారి కనిపించక అనేక ఇబ్బందులకు గురయ్యారు. గత నెలలో వర్షాలు బీభత్సం సృష్టించగా ప్రస్తుతం ఎండ తీవ్రత అధికంగా ఉంది., తెల్లవారుజాము నుంచి దారకొండ పరిసర ప్రాంతాల్లో మంచు అధికంగా కురుస్తుంది. దీంతో ముమ్ముందు చలి తీవ్రత అధికంగా ఉంటుందని స్థానికులు అంటున్నారు. ఇప్పడే మంచు తీవ్రత ఇలా ఉంటే, ముమ్ముందు ఎలా ఉంటుందోనని ప్రజలు భయాందోళన గురవుతున్నారు.

స్వచ్ఛభారత్ అమలులో నిర్లక్ష్యం!

ప్రజాశక్తి -కొయ్యూరు : అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండలంలో స్వచ్ఛభారత్ అమలు నీరుగారిపోతోందనే విమర్శలు వస్తున్నాయి. కొయ్యూరు మండలం రాజేంద్రపాలెంలో అల్లూరి పార్క్ వద్ద పేరుకుపోయిన చెత్తే దీనికి నిదర్శనం. తడి, పొడి చెత్త సేకరణకు పంచాయతీ కార్యాలయాల్లో ప్లాస్టిక్ డబ్బాలను ఇచ్చారే తప్ప, ఇంటింటికి వచ్చి చెత్త సేకరణ మాత్రం కరువైంది. కొన్ని పంచాయతీలలో ఈ చెత్త సేకరణ మూడు చక్రాల బండి మీద వచ్చి సేకరిస్తు ండగా, ఒకటి రెండు పంచాయతీలలో మాత్రం కరువైంది. దీంతో వీధులలో చెత్త పేరుకుపోయి, దుర్గంధం వెదజల్లుతోంది, ఫలితంగా దోమలు విజృంభిస్తూ, మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చెత్తసేకరణ, పారిశుధ్య పరిరక్షణపై పంచాయితీ అధికారులు దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

అల్లూరి పార్కు వద్ద పేరుకుపోయిన చెత్త

దారి చూపండి మహాప్రభో..!

జిల్లా కలెక్టర్‌కు ఉల్లిగుంట గ్రామ గిరిజనుల మొర



అధ్వానంగా ఉన్న ఉల్లిగుంట గ్రామ రహదారి

ప్రజాశక్తి - కొయ్యూరు: తమ గ్రామానికి దారి చూపాలని మండలంలోని యు. చీడిపాలెం పంచాయతీ, అతి మారుమూల ఉల్లిగుంట గ్రామ గిరిజనులు కోరుతున్నారు. తమ గ్రామానికి వెళ్లే దారి దుస్థితిని సెల్‌ఫోనులో వీడియో చిత్రీకరించి, ఆ క్లిప్పింగులను జిల్లా కలెక్టర్‌కు పంపించినట్టు గిరిజనులు తెలిపారు. 20 కుటుంబాలకు పైగా గిరిజనులు నివసిస్తున్న ఉల్లిగుంట గ్రామానికి నేటికీ సరైన దారి లేక బయట ప్రపంచానికి రావడానికి, తిరిగి వెళ్లడానికి ఎన్నో ప్రయాసలు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. వర్షాకాలంలో అయితే కాలువలు దాటలేక గ్రామానికి పరిమితమై పోతున్నామని ఆవేదన చెందుతున్నారు. అనారోగ్యంతో ఉన్న వారిని, గర్భిణులను ఆసుపత్రికి తరలించడానికి తాము పడే కష్టాలు చెప్పలేమని ఆవేదన వ్యక్తం చేశారు. యు.చీడి పాలెం, ఎర్రగొండ రోడ్డు నుండి తమ గ్రామానికి సుమారు మూడు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించి తమకు దారి చూపాలని ఉల్లిగుంట గిరిజనులు కోరుతున్నారు.

300 మందికి ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి -రంపచోడవరం : రాజమండ్రి రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్య శాల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 300మందికి వైద్యసేవలు అందించినటు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. డాక్టర్ టివి.సుబ్బారావు, డాక్టర్ దాసరి ఉమమహేష్. డాక్టర్ 'రాయుడు శ్రీనివాస్, డాక్టర్ 'సంపత్ కుమార్ పాల్గొని రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వీరిలో 53మందికి రక్తపరీక్షలు, ఏడుగురికి థైరాయిడ్ పరీక్షలు, 10మందికి ఫిజియో థెరపీలు చేసినట్లు స్వామీజీ తెలిపారు. అలాగే వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయ ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం నిర్వహించారు. కంటి వైద్య శిబిరంలో 65 మందికి కంటి పరీక్షలు చేసి, 16 మందికి కళ్లద్దాలు అందించారు. కంటి ఆపరేషన్‌కు ఐదుగురిని ఎంపికచేసి, వేమగిరి ఆసుపత్రికి తరలించారు. వైద్య శిబిరంలో క్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, నక్కా చంటిబాబు, వాలంటీర్స్ దాసరి పెద్ద అప్పారావు, అయినంపూడి సూర్య వర్మ పాల్గొన్నారు, రోగులు, సహాయకులకు భోజనం కల్పించారు.

పోయినవి

నా పేరు MALLARAPU SUMAN
S/o MALLARAPU RAMUDU
తేది. 10-09-2024న నెల్లిపూడి గ్రామం, గంగవరం మండలం, అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం కాంప్లెక్స్‌లో
నా PASSPORT No. X6001143,
National Trade Certificate (Electrician)
Roll No. 00170828000641
పడిపోయినవి. ఎవరికైన దొరికిన యెడల ఈ క్రింది ఫోన్ నెంబరుకు తెలియజేయగలరు.
సెల్ : 9573651765

నేటి నుండి 'పల్లె పండగ'

ప్రజాశక్తి-చింతపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన పల్లె పండగ కార్యక్రమాన్ని ఈనెల 14వ తేదీ నుంచి ప్రభుత్వం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం నిర్వహించబడుతుందని ఎంపీడీవో ఆశాజ్యోతి అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మికంగా నిర్వహించ తలపెట్టిన పల్లె పండుగ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు విధిగా పాల్గొవాలన్నారు. మండలంలోని 17 పంచాయతీల పరిధిలో ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారం దిశగా కృషి చేయాలన్నారు.

కొయ్యూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్లెపండుగ కార్యక్రమాన్ని ఈ నెల 14 నుంచి 20 వరకు అన్ని గ్రామాల్లో నిర్వహించనున్నట్లు టిడిపి నాయకుడు గుల్సింగి సత్యనారాయణ తెలిపారు. మండలంలో ఉన్న 33 పంచాయతీల్లో నిర్వహించే వేడుకల్లో ఆయా గ్రామాల్లోని కూటమి నేతలు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టనున్నారని వెల్లడించారు. పల్లె పండగ కార్యక్రమాన్ని అధికారులు, కూటమి శ్రేణులు సమన్వయంతో విజయవంతం చేద్దామన్నారు.

సైబర్ మోసాల నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి-జి.మాడుగుల: అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జి.మాడుగుల ఎస్సై షణ్ముఖరావు సంకల్పం కార్యక్రమంలో భాగంగా ఆదివారం బంధ వీధి, సంతబైలు, జిఎం కొత్తూరు, జి మాడుగుల జంక్షన్‌లో యువతకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా సోషల్ మీడియాని ఉపయోగించుకుంటూ సైబర్ లావాదేవీల మోసాలు, ఆల్కహాల్ సేవించడంతో నష్టాలపై వివరించారు. మత్తు పదార్థాలు రవాణా చేయడం, సహకరించడం చేస్తే చర్యలు తప్పవన్నారు. దీనిపై తెలియ పరచినవారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డిస్తున్న పర్యాటక శాఖ మేనేజర్

నిరుపేదలకు అన్నసమారాధన

ప్రజాశక్తి-చింతపల్లి: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని నిరుపేదలకు అన్నదానం చేయడం సంతృప్తికరంగా ఉందని పర్యాటక శాఖ మేనేజర్, సాన్ చారిటీ ఫౌండర్ సూరెడ్డి అప్పలనాయుడు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, చింతపల్లి మండలం లమ్మసింగి పంచాయతీ చీకటిమామిడి గ్రామంలో సుమారు 300 మంది పివిటిజి తెగకు చెందిన గిరిజనులకు అన్నదానం చేశామన్నారు.. భవిష్యతులో దాతల సహకారంతో మరెన్నో కార్యక్రమాలు చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రఘునాథ్, గ్రామపెద్ద రావుల నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

గీతం దూర విద్య కోర్సులలో అడ్మిషన్లు

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సిడిఒఇ) ఆధ్వర్యాన దూర విద్యా విధానంలో ఎమ్ఎ ఇంగ్లీష్, బిఎ, బికామ్ డిగ్రీ కోర్సులలో 2024 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు సిడిఒఇ డైరక్టర్ డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. ఇంటి వద్ద నుంచి దూర విద్యా విధానంలో ఈ కోర్సులను అభ్యసించే విధంగా ఏర్పాట్లుచేసినట్లు పేర్కొన్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో సూచనల మేరకు ప్రవేశ దరఖాస్తు తేదీలను పొడిగించినట్లు తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను నవంబర్ 15వ తేదీలోగా అందజేయాలని పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం దొండపర్తిలోని గీతం సిటీ సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తుల కోసం cdl@gitam.edu వెబ్‌సైట్‌ను పరిశీలించాల్సిందిగా సూచించారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- పట్టించుకోని అధికారులు
- మండిపడుతున్న గిరిజనులు

పొక్లయినర్‌తో చేపడుతున్న ఇసుక తవ్వకాలు

ప్రజాశక్తి-అనంతగిరిరూరల్: జిల్లాలోని డుంబ్రిగుడ, అనంతగిరి మండలాల్లో అడ్డు అదుపు లేకుండా ఇసుక అక్రమ రవాణా యదేచ్ఛగా జరుగుతుంది. కొంతమంది రాజకీయ నేతల అండదండలతో ఇసుక అక్రమార్కులు దర్జాగా ఇసుకను అక్రమ రవాణా చేస్తూ కోట్లకు పడగలెత్తుతున్నారు. వాస్తవానికి అరకులోయ, డుంబ్రిగుడ, అనంతగిరి మండలాల్లో ప్రభుత్వ పరంగా ఎటువంటి ఇసుక రీచ్‌లు లేవు. ప్రభుత్వ అనుమతులతో అధికారికంగా నిర్మించే అభివృద్ధి భవనాలకు మాత్రం ఇసుక సరపరా చేసే విధానం ఉంది. ప్రైవేటు ఇతరత్రా నిర్మాణాలకు ఇసుక సరఫరా చేయాలంటే రెవిన్యూ, పంచాయతీ అధికారుల అనుమతులు తప్పనిసరి.

డుంబ్రిగుడ, అనంతగిరి మండలాల్లో మాత్రం ఇసుక అక్రమార్కులు ఇవేమీ పట్టించుకోకుండా ధనార్జనే ధ్యేయంగా పెట్టుకొని ఇష్టారాజ్యంగా తరలించకు పోతున్నారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయవలసిన అధికారులు కమీషన్లు తీసుకుని పట్టించుకోలేదని గిరిజనులు ఆరోపిస్తున్నారు.

డుంబ్రిగుడ మండలంలో గోరాపూర్, కురిడి గెడ్డ పరిసర ప్రాంతం నుండి, అనంతగిరి మండలంలోని కాశీపట్నం, గరుగుబల్లి, జిలుగులపాడు, వెంకయ్యపాలెంలో వందలాది లారీలలో ఇసుక అక్రమ రవాణా జరుగుతుంది. ఒకపక్క ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా ఇసుక పంపిణీ చేస్తున్నామని చెబుతుండగా ఇక్కడ అధికారికంగా ఎటువంటి అనుమతులు లేకపోయినా ఇసుక అక్రమార్కులు లారీ, వ్యాన్ లోడులకు వేలాది రూపాయలు వసూలు చేస్తూ ప్రజలను దోపిడీకి గురి చేస్తున్నారని గిరిజనులు మండి పడుతున్నారు. ఇసుక దర్జాగా అక్రమ రవాణా జరుగుతున్నా కూటమి ప్రభుత్వ పాలకులకు, అధికారులకు ఎందుకు పట్ట లేదని గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాల్టా చట్టానికి వ్యతిరేకంగా గెడ్డలను గుట్టలుగా మారుస్తుండటంతో భవిష్యత్తులో గోరపూర్ ఇతర ప్రాంతాలలో కూడా తీవ్ర మంచినీటి ఎద్దడి నెలకొనే ప్రమాదం ఉందని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోరపూర్ గెడ్డ ప్రధాన మార్గంలో ఇసుక అక్రమ తవ్వకాలతో ఎక్కడికక్కడ పెద్ద పెద్ద గోతులు ఏర్పడుతున్నాయని, వీటితో అనేకమంది మృత్యువాత పడే ప్రమాదం ఉందని ఆదివాసి ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్నతాధికారులు ఇసుక అక్రమ రవాణాపై దృష్టి సారించకపోవడం, అక్రమార్కులు ప్రభుత్వ పాలకులను, అధికారులను తప్పుదోవ పట్టించడంతోనే యదేచ్ఛగా అడ్డు అదుపు లేకుండా ఇసుక రవాణా కొనసాగుతుందని ఆదివాసి, గిరిజన నేతలు, ప్రజా సంఘాల, స్వచ్ఛంద సేవ సంస్థ ప్రతినిధులు తెలిపారు.

లారీలో తరలిస్తున్న ఇసుక

మొరాయిస్తున్న బిఎస్ఎన్ఎల్ సేవలు

అవస్థలు పడుతున్న సెల్ వినియోగదారులు

ప్రజాశక్తి -హుకుంపేట: బిఎస్ఎన్ఎల్ సెల్ సేవలు సరిగ్గా అందక వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. మారుమూల ప్రాంతాల నుంచి రైతులు, పలు పథకాల లబ్ధిదారులు మండల కేంద్రానికి నెట్ సేవల నిమిత్తం వస్తుంటారు. మండల కేంద్రంలో గత నెల రోజుల నుంచి బిఎస్ఎన్ఎల్ సిగ్నల్ అంతంత మాత్రంగా ఉండడంతో ఇంటర్నెట్ సౌకర్యం సరిగా లేక యూపీఐ, లావాదేవీలు, బ్యాంక్ సేవలకు అంతరాయం ఏర్పడుతోంది. ఒకవైపు జియో రీఛార్జిలు పెంచడంతో పలువురు బిఎస్ఎన్ఎల్ సేవల వైపు మొగ్గు చూపుతున్నారు. సరస మైన ధరలకే బిఎస్ఎన్ఎల్ నెలవారి రీచార్జి సేవలు అందుబాటులో ఉండడంతో అందరూ సేవలు వినియోగించేందుకు ముందుకు వస్తున్నాయి. అయితే బిఎస్ఎన్ఎల్ సేవలు మొరాయిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

మండల కేంద్రంలో నెట్ సెంటర్ల నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పిఎం కిసాన్ ఖాతాలో నగదు జమ కావడంతో తీసుకునేందుకు మండల కేంద్రానికి రైతులు తరలి వస్తున్నారు. డ్వాక్రా మహిళలు నెలవారి లావాదేవీలు బ్యాంకులో చెల్లించేందుకు వస్తున్నారు. వీరంతా అవస్థలు పడుతున్నారు. బిఎస్ఎన్ఎల్ సేవలు పూర్తిస్థాయిలో పునరుద్దరించి వినియోగ దారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

ముగిసిన వెంకన్న బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-నక్కపల్లి: ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిసాయి. ఉత్సవాలు ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, కృష్ణమా చార్యులు, శేషాచార్యుల ఆధ్వర్యంలో మహా పూర్ణాహుతి, డోలా ఉత్సవము, వినోదోత్సవం, చక్రవారీ స్నానం, కంకణ విసర్జనలు, విశేష పూజా కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాద్ ఆచార్యులు పలువురు భక్తులను ఉంగరం కోసం విచారణ చేపడుతూ తంతు నిర్వహించారు. చివరికి స్వామివారి వస్త్రములోనే ఉంగరం ఉన్నట్లు గుర్తించి వెల్లడించడంతో భక్తులందరూ ఆనందం వ్యక్తం చేశారు.

మండలంలోని ఉపమాకలో విజయదశమి పర్వదినం పురస్కరించుకుని అర్చకులు శమీ పూజ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవమూర్తులను పుణ్యకోటి వాహనంలో అధిష్టింపజేసి బంధుర సరస్సు వద్ద లంక వారి మండపం వద్దకు తీసుకుని వెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. జమ్మి చెట్టుకు విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు

సమస్యలు పరిష్కరించాలని హోం మంత్రికి వినతి

ప్రజాశక్తి- నక్కపల్లి: పాయకరావుపేట నియోజకవర్గం లో జనవాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిష్కరించాలని కోరుతూ జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ పార్టీ నాయకులతో కలిసి హెూం మంత్రి వంగలపూడి అనితకు ఆదివారం నక్కపల్లిలో ఆమె స్వగృహం నందు వినతిపత్రం అందజేశారు. జనవాణి కార్యక్రమంలో భాగంగా సుమారుగా నెల రోజుల నుండి ప్రజా సమస్యలపై అర్జీలను స్వీకరించడం జరిగిందని శివదత్ అన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి, సత్వరం పరిష్కారం అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజా సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు చేపడతానని హెూం మంత్రి అనిత అన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులైన జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్‌ను హెూం మంత్రి వంగలపూడి అనిత సత్కరించారు. గడచిన 5 సంవత్సరాలుగా పౌర సరఫరాల విభాగం నిర్వీర్యం అయిందని, గాడిలో పెట్టి నాణ్యమైన సేవలు ప్రజలకు అందేలా కృషి చేయాలని అనిత సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-కోటవురట్ల: మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద 1995-2000 పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఉత్సాహంగా సాగింది. ఆనాటి జ్ఞాపకాలను ఒకరినొకరు గుర్తుకు తెచ్చుకుంటూ ఆనందంగా ఉత్సాహంగా గడిపారు. ఆనాటి ఉపాధ్యాయులు సైతం పాల్గొనడంతో వారికి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

కొత్తకోటలో వీధి కుక్కల బెడద

- భయాందోళన చెందుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి -కొత్తకోట: రావికమతం మండలం మేజర్ పంచాయతీ కొత్తకోటలో వీధి కుక్కల బెడద ఎక్కువైంది. గ్రామంలో ఏ వీధిలో చూసినా కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. ఒంటరిగా నడిచి వెళ్లిన వ్యక్తుల తో పాటు వాహనదారుల పై కూడా దాడులు చేస్తున్నాయి. పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థిని, విద్యార్థులు, వృద్దులపై సైతం దాడులు చేసి గాయ పరచడంతో తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఈ కుక్కలు బారినపడి ఇప్పటికే పలువురు గాయలపాలయ్యారు. రాత్రి సమయంలో బిఎన్ రోడ్డు మెయిన్ రోడ్డు పైనే గుంపు గుంపులుగా తిరుగుతూ ప్రజలను తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఇప్పటికైనా స్థానిక పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల ఏరివేత కార్యక్రమం చేపట్టాలని కోరుతున్నారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు

ప్రజాశక్తి-గొలుగొండ: నర్సీపట్నం నుండి కృష్ణదేవిపేట వెళ్లే ప్రధాన రహదారి అధ్వాన్నంగా మారింది. ప్రధానంగా గొలుగొండ కాలనీ వద్ద రోడ్డు గుంతలు ఏర్పడి పూర్తి పాడైపోయింది. దీంతో, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి ఈ రోడ్డుకు కనీసం మరమ్మత్తులు చేపట్టాలని కోరుతున్నారు.

కృష్ణదేవిపేట ఎస్ఐగా తారకేశ్వరరావు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కృష్ణదేవిపేట ఎస్సైగా వై.తారకేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో ఇంటిలిజెన్స్‌లో విధులు నిర్వహిస్తూ ఇక్కడ ఎస్సైగా ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్సై టి.దివ్య అనకాపల్లి ఎస్‌బీకి జిల్లా అధికారులు బదిలీ చేశారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న జమాల్ ఖాన్

ప్రమాద బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- కూనవరం : ప్రమాదంలో రెండు కాళ్లు చచ్చుబడిపోయి, జీవచ్ఛవంలా మంచానికే పరిమితమైన పెద్ద ఆర్కూరు గ్రామానికి చెందిన సోయం శంకరబాబు అనే గిరిజన యువకుడికి ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ అండగా నిలిచారు. శంకరబాబు దయనీయ పరిస్థితిని, కుటుంబం పడుతున్న మానసిన వేదన, ఆర్థిక ఇబ్బందులను వాట్సాప్ మెసేజ్ ద్వారా తెలుసుకున్న డాక్టర్ జమాల్‌ఖాన్, స్వయంగా పెద్ద ఆర్కూరులోని బాధితుని ఇంటి వద్దకు వెళ్లి పరామర్శించారు. ఆరు నెలల క్రితం మినుములు కోత మిషన్ మీద పడడంతో రెండు కాళ్లు చలనం లేకుండా పోయాయని, ఆసుపత్రిలో వైద్యం చేయించినా నయం కాలేదని బాధితుడు తన బాధను డాక్టర్ జమాల్‌ఖాన్‌కు వివరించాడు. దీనిపై స్పందిస్తూ, అధైర్యపడవద్దని, బాధితుడిని, కుటుంబ సభ్యులను ఓదార్చి భరోసానిచ్చారు. జెకెసి ట్రస్టుగా తనవంతుగా తక్షణసాయంగా రూ.8వేలను అందజేశారు. ప్రభుత్వ వైద్యులకు సహకరించి వారు చెప్పినట్లుగా ఆసుపత్రులకు వెళ్లి చికిత్స పొందాలని సూచించారు. కొంత మెరుగైన తర్వాత తాను ఆయుర్వేదం వైద్యం ద్వారా చికిత్స చేసి మరల నడిచేలా చేస్తానని యువకునికి కుటుంబీకులకు ధైర్యాన్ని నింపారు. కార్యక్రమంలో జెకెసి ట్రస్ట్ సభ్యులు ఎస్‌కె. రియాజ్, ఎస్‌కె.షాజహాన్, మడివి రాజు పాల్గొన్నారు.

నిరాశ్రయుల షెల్టర్ల సంఖ్య పెంచరూ..

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ నగరంలో నిరాశ్రయులను ఆదుకునే చర్యల్లో భాగంగా జివిఎంసి ఏర్పాటు చేసిన నిరాశ్రయుల షెల్టర్ల సంఖ్యను పెంచాలని పలువురు కోరుతున్నారు. ప్రస్తుతం నిర్వహణలో ఉన్న షెల్టర్ల పనితీరు ఆశించిన స్థాయిలో లేదని, వాటిని చక్కదిద్దాలని అంటున్నారు. ప్రస్తుతం నగరంలో ఎనిమిది చోట్ల నిరాశ్రయుల షెల్టర్లు ఉన్నాయి. 2011లో వీటిని ఏర్పాటు చేశారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు అన్ని షెల్టర్లలో కలిపి 6150 మంది నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించారు. జివిఎంసి ఆధ్వర్యంలో ఏర్పాటైన భవనాలలోనే ప్రభుత్వ నిరాశ్రయుల షెల్టర్లు నాడు ఏర్పాటయ్యాయి. షెల్టర్లను నిర్వహించే బాధ్యతను ప్రభుత్వం జివిఎంసికి అప్పగించింది. కొన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి జివిఎంసి సాయంతో, ప్రభుత్వ రంగ సంస్థల సిఎస్ఆర్ నిధులు, ఇతర దాతృత్వ సంస్థల సహకారంతో, పోలీసు అధికారుల సహకారంతో ఈ షెల్టర్లను నడుపుతూ వస్తున్నాయి. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ మహిళా సంఘం అందజేసిన వాహనాన్ని నడుపుతూ ఎప్పటికప్పుడు రైల్వే స్టేషన్, నగరంలోని ఇతర ప్రాంతాలలో నిస్సహాయంగా కనిపించిన భిక్షగాళ్లను, అభాగ్యులను, మహిళలను షెల్టర్లకు తరలించి వైద్య సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఈ విధంగా షెల్టర్లకు వచ్చే అభాగ్యులు కొద్ది రోజులు ఉండి తర్వాత వెళ్లిపోతున్నారు. అలా వెళ్లేవారు ఏదో ఒక వృత్తి చేసుకొని జీవించడం కాకుండా మళ్లీ భిక్షాటన చేయడం, గతంలో వారు చేస్తున్న నిరుపయోగ పనులనే చేస్తూ మళ్లీ నగరంలో అక్కడక్కడా కనిపిస్తుండటం పరిపాటిగా మారింది. దీంతో షెల్టర్ల అసలు ప్రయోజనం నెరవేరడం లేదని చెప్పవచ్చు. అందుకే ప్రభుత్వం జోక్యం చేసుకొని ఇటువంటి షెల్టర్ల పనితీరును గుర్తించి, నిరాశ్రయ షెల్టర్లను ప్రభుత్వ భవనాల్లో నిర్వహిస్తూ, వీటిలో ఉండే అభాగ్యులకు సాంకేతిక శిక్షణ ఇచ్చి, వారి కాళ్లపై వారు నిలబడేలా చూడాలని ఇంధన శాఖ మాజీ కార్యదర్శి ఇఎఎస్.శర్మ ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాసిన లేఖలో కోరారు. నగర జనాభా బాగా పెరిగినందున, ఆ మేరకు షెల్టర్లు సంఖ్యను పెంచాలన్నారు. ప్రతి లక్ష మంది జనాభాకు ఒక షెల్టరు ఉండాలని సుప్రీంకోర్టు ఆదేశించిన సంగతిని ఆయన ఆ లేఖలో గుర్తు చేశారు. ఈ లెక్కన విశాఖలో ప్రస్తుతం ఉన్న జనాభా దృష్ట్యా చూస్తే కనీసం 25 షెల్టర్లు ఉండాలి. ప్రస్తుతం వీటిలో కనీసం సగం కూడా లేవు. విశాఖ నగరంతో పాటు జివిఎంసిలో విలీనం కాబడ్డ భీమిలి, అనకాపల్లి, గాజువాక వంటి ప్రాంతాలలో కూడా ఇటువంటి షెల్టర్లను ఏర్పాటు చేయవలసిన అవసరం ఉంది.

కళ్లు మూసుకుంటాం.. కానివ్వండి

- రోడ్డు పక్కనే ప్రభుత్వ భూమి ఆక్రమణ
- గెడ్డ వాగును కప్పేసిన వైనం
- కలెక్టర్ హెచ్చరిక బోర్డు తొలగింపు
- పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, పరవాడ విలేకరి

జిల్లాలోని పరవాడ మండలం, ఈ బోనంగి రెవెన్యూ, గొర్లెవానిపాలెం పంచాయతీ పరిధిలోని విలువైన ప్రభుత్వ భూమి కళ్లముందే ఆక్రమణకు గురవుతున్నా రెవెన్యూ అధికారులకు పట్టడం లేదు. రోడ్డు పక్కనే కబ్జా పర్వం కొనసాగుతున్నా పక్క నుంచి తప్పుకుని వెళ్తున్నారు తప్ప చర్యలు తీసుకోవడం లేదు. దీంతో కోట్ల రూపాయలు విలువజేసిన విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమించి అమ్మడంలో టిడిపి, జనసేన, వైసిపి కార్యకర్తలు ఏకమవుతున్నారు. వారిని కాదనలేని రెవెన్యూ అధికారులు రాజీపడుతున్నారు. పోనీ.. ఆక్రమించి అమ్మకాలు జరుగుతున్న ప్రభుత్వ భూమి ఎక్కడో మారుమూలది కాదు. గాజువాక - యలమంచిలి రహదారికి ఆనుకొనివున్న 297, 293 సర్వే నెంబర్లలోని రూ.25 కోట్లకు పైబడిన రెండెకరాల 12 సెంట్లు భూమి. దీన్ని చదునుచేసి ప్రయివేటు వ్యక్తులు నిర్మాణాలు చేపడుతున్నా నిలువరించే కనీస ప్రయత్నం రెవెన్యూ యంత్రాంగం చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఎంతో కాలంగా సర్వే నెంబర్ 297, 293లోని ప్రభుత్వ భూమిలో శాశ్వత నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ భోనంగి రెవెన్యూలో ప్రభుత్వానికి చెందిన భూమిని ఆక్రమించిన వారిపై సెక్షన్ 4 (1), 4 (2), 4 (3) ఎపి ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ 1982 ప్రకారం చర్యలు తీసుకుంటామని నాలుగేళ్ల క్రితం కలెక్టర్ హెచ్చరిక బోర్డును రోడ్డు పక్కనవున్న ఈ సర్వే నెంబర్లలోని భూమిలో ఏర్పాటు చేశారు. ఆక్రమణదారులు ఈ బోర్డును తొలగించి, గ్రావెల్‌తో కప్పేశారు. ఆక్రమణపాలైన ప్రభుత్వ భూమిని ఇనాం కింద చెప్పి, ప్రయివేటు వ్యక్తులు లాభపడేలా కొంతమంది రెవెన్యూ అధికారులు సహాయపడుతూ వస్తున్నారు. వాస్తవానికి 1956-57 సర్వే సెటిల్‌మెంట్ ప్రకారం సర్వే నెంబర్ 297, 293లోని భూమి వాగులుగా నమోదైంది. పైన కొండల నుంచి ఈ వాగుల ద్వారా వర్షపు నీరు ఆయకట్టు కలిగిన సర్వే నెంబర్ 292లోని ఈతల చెరువుకు చేరేది. వాగులను కొందరు ఆక్రమించడంతో చెరువులోకి నీరు చేరక ఆయకట్టు దెబ్బతింది. స్థానికులు అనేక సార్లు ఫిర్యాదు చేసినా ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించకుండా రెవెన్యూ అధికారులు మౌనందాల్చుతున్నారు.

ఆక్రమణదారులు కప్పేసిన ఈతల చెరువు గెడ్డ వాగు

సీలేరులో కురుస్తున్న వర్షం

వర్షంతో వారపు సంతకు ఇక్కట్లు

ప్రజాశక్తి -సీలేరు: వర్షం కారణంగా ఆదివారం సీలేరులో నిర్వహించే వారపు సంతకు అంతరాయం ఏర్పడింది. సీలేరులో కొన్ని రోజులుగా ఉదయం నుంచి మధ్యాహ్న వరకు ఎండ తీవ్రత అధికంగా ఉంటూ సాయంత్రం సమయంలో అడపాదడపావర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉష్ణోగ్రత అధికంగా ఉంది. సాయంత్రం వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని ఆకాశం మేఘావతమై వర్షం కురిసింది. దీంతో సంతకు సరుకులు తీసుకొచ్చిన వ్యాపారులు కాస్త ఇబ్బందులకు గురయ్యారు. మరోపక్క ఇటీవల వరదలకు పిల్లిగెడ్డ వంతెన కొట్టుకుపోవడంతో రహదారి సౌకర్యం లేక దుప్పిలివాడ పంచాయతీ పరిధి కాట్రగెడ్డ, పిల్లి గెడ్డ రైతులు సీలేరు వారపు సంతకు కూరగాయలు తీసుకురాలేని పరిస్థితి నెలకొంది. ఆయా గ్రామస్తులు ఒరిస్సా ఛత్రకొండ వారపుసంతకు వెళ్లిపోతున్నారు. దీంతో వారపుసంతకు కూరగాయలు వచ్చే పరిస్థితి లేక కొనుగోలుదారులు ఉసూరుమని వెళ్లిపోయారు.

కూనవరం, ఒరిస్సా నుంచి వచ్చిన వ్యాపారులు కూరగాయలు అధిక ధరలకు విక్రయాలు జరపడంతో సామాన్యులు దినసరి కూలీలు విరివిగా కొనుగోలు చేయలేక సతమతమయ్యారు. కాలీఫ్లవర్ కిలో రూ.100, పచ్చిమిర్చి రూ.100 నుంచి రూ.150, బీన్స్ రూ.80, ఉల్లిపాయలు కిలో రూ.50 చిక్కుళ్ళు రూ.80 అల్లం రూ.100 కాగా టమాటా గతవారం కిలో వంద రూపాయలుకు విక్రయాలు జరపక ఈ వారం కొంతమంది వ్యాపారులు కిలో 80 మరికొంతమంది 60 రూపాయలుకు విక్రయాలు జరిపారు.

14 నుంచి 17 వరకు పర్యాటక ప్రదేశాలు తాత్కాలిక మూసివేత

ప్రజాశక్తి - రంపచోడవరం : ఈనెల 14 నుంచి 17 వరకు తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆయా రోజుల్లో పర్యాటక ప్రాంతాలకు సందర్శకులను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. తుపాను, భారీ వర్షాలను ఎదుర్కొనేందుకు ఎక్కడికక్కడ అధికారులను సిబ్బందిని నియమించామన్నారు. తుఫాను ప్రభావంతో భారీ వర్షాలకు కొండ కాలువలు ఉధృతంగా ప్రవహించే ప్రమాదం ఉన్నందున, కాలువల్లోకి దిగి దాటవద్దని సూచించారు. ఏజెన్సీలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు.

అల్పపీడనంతో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -రంపచోడవరం : బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనున్న నేపథ్యంలో ఈనెల 14, 15, 16 తేదీల్లో విస్తారంగా వర్షాలుంటాయని వాతావరణశాఖ. హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషారాణి సూచించారు. ప్రజలకు ఎటువంటి ముప్పు వాటిల్లకుండా అన్ని మండలాల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.

ఫుడ్ హబ్‌గా విశాఖ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ మహా నగరం ఫుడ్ హబ్‌గా నిలుస్తోందని సినీ హీరో కంచర్ల ఉపేంద్ర బాబు అన్నారు. ఆశీలుమెట్ట దరి రామ్ నగర్ బచ్ పన్ ప్లే స్కూల్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన డెలిష్ ఎక్స్‌ప్రెస్ ఫుడ్ హబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. డెలిష్ ఎక్స్‌ప్రెస్ రెస్టారెంట్ వినియోగదారులు మన్ననలు పొందనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విశాఖలో హోటళ్లు, రెస్టారెంట్ల సంఖ్య రోజు రోజుకూ పెరగడం సంతోషకరమన్నారు. రెస్టారెంట్ యజమాని జయశంకర్ శ్రీనివాస్ మాట్లాడుతూ త్వరలోనే యాప్ ద్వారా ఫుడ్ ఆర్డర్స్ ఇచ్చే సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు.

నగరంలో పెళ్లి సందడి

- డిసెంబరు ఆఖరు వరకూ ఇదే పరిస్థితి
- కల్యాణ మండపాలకు, కేటరింగ్ నిర్వాహకులకు డిమాండ్
- ఇప్పటికే అడ్వాన్స్‌ల చెల్లింపులు మొదలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

విశాఖలో పెళ్లి సందడి కనిపిస్తోంది. జూన్ నెలాఖరు నుంచి సరైన ముహూర్తాలు లేనందున వివాహాలు, శుభకార్యాలు వాయిదా పడుతూ వచ్చాయి. ఎట్టకేలకు శుభ ముహూర్తాలు వచ్చాయని పురోహితులు చెబుతున్నారు. దసరా రోజు నుంచి డిసెంబర్ ఆఖరి వరకు వివాహాలకు, శుభకార్యాలకు సుమారు 30 మంచి ముహూర్తాలు ఉన్నాయని వారంటున్నారు. దీంతో భాజా భజంత్రీలు, మండపాలను అలంకరించే వారు, కేటరింగ్ నిర్వాహకులు, పురోహితులు, మేకప్, డెకరేషన్ ఆర్టిస్టులు, క్యాటరింగ్ క్యాబ్‌ల వారు, శుభలేఖల ప్రింటింగ్ ప్రెస్‌లు, ఫ్లెక్సీ ప్రింటర్స్, ఫోటోగ్రఫీ, టెంట్ హౌస్, వంట మేస్త్రీలు, వంట పనివారు, క్యాటరింగ్ బాయ్స్, బ్యూటిషన్లు, మెహందీ ఆర్టిస్టులు, పూలు అమ్మేవాళ్లు, మంగళ వాయిద్య కళాకారులు, డిజె మ్యూజిక్ నిర్వాహకులు.. ఇలా పెళ్లి వేడుకలతో ముడిపడిన ప్రతి ఒక్కరిలో ఆనందం వ్యక్తమవుతోంది. ముందుగానే ఎంపిక చేసుకొని, అడ్వాన్సులు ఇచ్చే పనుల్లో శుభ కార్యాలు నిర్వహించుకునే వారు నిమగ్నమయ్యారు. ఇప్పటి నుంచే సంప్రదింపులు చేస్తున్నారు. నగరంలో ఓ రేంజ్‌లో ఆర్డర్లు మొదలైనట్టు భోగట్టా. దసరాతో పాటు శుభకార్యాలకు అనువైన నెల కావడంతో నగరంలో పెద్దపెద్ద వస్త్ర దుకాణాలు, బంగారం దుకాణాల్లో అక్టోబర్‌లో అమ్మకాలు కూడా పెరిగాయని వ్యాపారాలు అంటున్నారు. ఇదే సమయంలో ఫంక్షన్ హాల్స్ బుకింగ్‌లు జోరందుకున్నాయి. పెద్ద పెద్ద కన్వెన్షన్ సెంటర్లు ఇప్పటికే బుక్ అయ్యాయి.

వివాహాల ముహూర్తాలు

పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు, ఉపనయనాలు తదితర శుభకార్యాలకు ఈ నెల ఎంతో అనుకూలమైనదని రాష్ట్ర అర్చక సంఘం కన్వీనర్ శ్రీరంగం గోపి కృష్ణమాచార్యులు తెలిపారు. వివాహాల ముహూర్తాలు గురించి చెబుతూ... అక్టోబర్ 13, 16, 20, 27 తేదీలలో మంచి ముహూర్తాలు ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే నవంబర్‌లో 3, 7, 8, 9, 10, 13, 14, 16, 17 తేదీలు, డిసెంబర్‌లో 5, 6, 7, 8, 11, 12, 14, 15, 26 తేదీలలో మంచి ముహూర్తాలు ఉన్నాయని తెలిపారు.

ప్రభుత్వ కల్యాణ మండపాలు కరువు

ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే కల్యాణ మండపాలు నగరంలో దాదాపు లేవు. జివిఎంసికి చెందిన కల్యాణ మండపాలను ప్రైవేటు వ్యక్తులకు వేలం పద్ధతిలో అప్పగించారు. దీంతో ప్రైవేట్ వ్యక్తులు జివిఎంసి నిర్దేశించిన అద్దె కాకుండా, తమకు నచ్చిన రీతిలో అద్దెను పెంచి ఇస్తున్నారు. ఇటువంటి కల్యాణ మండపాలను బుక్ చేసుకునే ముందు సంప్రదిస్తే, కల్యాణ మండపం అద్దెకు కావాలంటే, కల్యాణ మండపం అద్దె మాత్రమే కాకుండా వివాహానికి అవసరమైన డెకరేషన్, భాజా భజంత్రీలు, లైటింగ్, భోజనాలు వగైరా వాటిని కూడా తాము సమకూరుస్తామని, వాటిని కూడా తమ వద్దనే బుక్ చేసుకోవాలని కండిషన్ పెడుతున్నారు. అలా ఇష్టపడేవారు వారి వద్ద అన్నీ బుక్ చేసుకుంటున్నారు. భరించలేని పేద, మధ్య తరగతి వారు కల్యాణ మండపాలకు దూరంగా ఉంటూ జివిఎంసికి చెందిన రోడ్లపైన, సమీపంలోని కమ్యూనిటీ హాల్స్, పాఠశాలలు వగైరా వాటిలో వివాహాలు జరుపుకునే పరిస్థితి నెలకొంది.